ఏజెన్సీలో ముమ్మరంగా వరికోతలు

- యంత్రాలతో కోత కోసేందుకే మొగ్గు
- సమయం, ఖర్చులు తగ్గుతాయంటున్న రైతులు
- నియోజకవర్గంలో 24247 ఎకరాల్లో వరిపంట



బుట్టాయగూడెంలో వరి పంట కోస్తున్న యంత్రం

బుట్టాయగూడెం: ఈ ఏడాది ఖరీఫ్ సేద్యం చివరి అంకానికి చేరుకుంది. ఏజెన్సీ ప్రాంతంలోని గ్రామాల్లో వరికోతలు ఊపందుకున్నాయి. గత కొద్దిరోజులుగా ముమ్మరంగా యంత్రాలతో పనులు జరుగుతున్నాయి. వరి కోత పనులు యంత్రాలతో చేపట్టడం వల్ల సమయంతో పాటు కూలీల ఖర్చు తగ్గుతుందని రైతులు చెబుతున్నారు. అయితే వరికోతలో యంత్రాలను వినియోగించే సమయంలో రైతులు ఏమరుపాటుగా ఉంటే నష్టపోవాల్సి వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. వరికోత యంత్రాలతో పనులు చేపట్టే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. నియోజకవర్గంలో 24,247 ఎకరాల్లో వరి సాగు

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పోలవరం నియోజకవర్గంలోని బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు, కొయ్యలగూడెం, టి.నరసాపురం, పోలవరం మండలాల పరిధిలో సుమారు 24,247 ఎకరాల్లో రైతులు వరి పంట వేసినట్లు అధికారులు తెలిపారు. బుట్టాయగూడెం మండలంలో 3,561 ఎకరాలు, జీలుగుమిల్లిలో 3,020, పోలవరంలో 6,569, కొయ్యలగూడెంలో 6,584, కుక్కునూరులో 858, వేలేరుపాడులో 1255, టి.నరసాపురంలో 2,400 ఎకరాల్లో రైతులు వరి పంటలను వేయడం జరిగింది. ప్రస్తుతం ముమ్మరంగా యంత్రాలతో వరికోత పనులు సాగుతున్నాయి.

జాగ్రత్తలు తీసుకోవాలి



యంత్రాలతో వరికోతలు చేపట్టే రైతులు తప్పనిసరిగా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. దిగుబడి నిల్వ ఉంచుకునే రైతులు కోత పూర్తి చేసిన వెంటనే తేమలేని ప్రదేశాల్లో ధాన్యాన్ని ఆరబోసి పూర్తిగా ఆరబెట్టిన తర్వాత నిల్వ చేసుకోవాలి.

– డి.ముత్యాలరావు, ఏఓ, బుట్టాయగూడెం

వరి మాసూళ్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- పూర్తిగా భూమి ఎండిన తర్వాత వరికోతలు కోస్తే సమయం పూర్తిగా ఆదా అవుతుంది.
- పొలంలో రాళ్లు ఉండే చోటును ముందుగానే గుర్తిస్తే కోత సమయంలో యంత్రం బ్లేడుకు నష్టం వాటిల్లకుండా ఉంటుంది.
- తప్పనిసరిగా కోత యంత్రాలకు సంబంధించిన డ్రైవర్‌లతోపాటు అతనికి తోడుగా మరొకరిని సహాయకుడిగా పంపించాలి.
- విద్యుత్ స్తంభాలకు చాలా దూరం నుంచే యంత్రాలను వెళ్లనివ్వాలి.
- వరిపంట నేలకు ఆనుకున్న సమయంలో యంత్రంతో కాకుండా కూలీలతో కోత కోయించాలి.
- వాతావరణంలో మార్పులు ఉన్న సమయంలో కోతలు కోయకుండా ఉండటమే మంచిది. నేల, వరి పంటల్లో తేమ లేదనుకున్న సమయంలో మాత్రమే యంత్రాల ద్వారా కోతలు చేయించాలి.

గిరిజన చట్టాల అమలులో విఫలం

బుట్టాయగూడెం: ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. బుట్టాయగూడెం మండలం ముప్పినవారిగూడెంలో ఆ సంఘ సమావేశం బేతి కిశోర్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. వనజ మాట్లాడుతూ గిరిజన చట్టాల అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని విమర్శించారు. నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని, ఐటీడీఏ రెగ్యులర్ పీఓను నియమించాలని కోరారు. పేద గిరిజనులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలన్నారు. తొలుత సీపీఐ జెండాను నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల నాయకులు చోడెం దుర్గ, ఉయికే చంద్రం, బాడిస రాము, పిట్టా ప్రసాద్, కుర్సం సూర్యచంద్రరావు, మడకం గంగరాజు, దుర్గారావు, నాగమణి, మధు పాల్గొన్నారు.

స్త్రీలపై దాడులను ఖండించాలి



ఆరెంజ్ కలర్ డ్రెస్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులు

జంగారెడ్డిగూడెం: స్త్రీలపై జరిగే దాడులను ప్రతిఒక్కరూ ఖండించాలని ప్రతిభ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ కాసర లక్ష్మీ సరోజా రెడ్డి అన్నారు. పాఠశాలలో సోమవారం ఆరెంజ్ డేను నిర్వహించారు. మహిళల హక్కులపై అవగాహన కలిగించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు నారింజ రంగు దుస్తుల్లో ఆకట్టుకున్నారు.

యథేచ్ఛగా సారా విక్రయాలు

లింగపాలెం: మండలంలో నాటు సారా విక్రయాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. నాటు సారా తాగితే ప్రాణహాని సంభవిస్తుందని మహిళలు ఆందోళన చెందుతున్నారు. కొన్ని గ్రామాల్లో సంబంధిత శాఖ సిబ్బందికి అమ్మకందారులు ఒప్పందం ప్రకారం ముడుపులు చెల్లిస్తూ ఉండటంతో దాడులు చేయడంలేదని, దీంతో వ్యాపారం సక్రమంగానే సాగుతోందని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నాటుసారా అమ్మకాలను అరికట్టాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

స్పందనకు 21 అర్జీలు

జంగారెడ్డిగూడెం: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఆర్డీఓ ఎంవీ రమణ ఆధ్వర్యంలో ప్రజలను సమస్యలపై వినతులు స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఆర్డీఓ ఆదేశించారు. స్పందన కార్యక్రమంలో మొత్తం 21 అర్జీలు అందాయన్నారు. వీటిలో ఎక్కువగా భూ సంబంధిత సమస్యలు వచ్చినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక సోమవారం పూజలు



గుంజవరం ఉమాభోగలింగేశ్వరస్వామి



ఉమా సమేత రామలింగేశ్వర స్వామి



జంగారెడ్డిగూడెంలో శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు



మద్దె అంజన్నకు లక్ష తమలపాకుల అర్చన చేస్తున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని ఆలయాలు శివనామ స్మరణతో మార్మోగాయి. కార్తీక సోమవారం శివాలయాలకు భక్తులు పోటెత్తారు. ప్రధాన శివాలయాలైన బైనేరు ఉమాసహిత రామలింగేశ్వరస్వామి, పేరంపేట రాజరాజేశ్వరస్వామి, జెడ్పీహైస్కూల్ వద్ద ఉన్న శివాలయం, గుహాలయంలోని ఓంకారేశ్వరస్వామితో పాటు, నూకాలమ్మ, ముత్యాలమ్మ, విజయ దుర్గమ్మ, లలితాదేవి ఆలయాల్లోని శివలింగాలకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ముక్కంటికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు.

రామలింగేశ్వరస్వామికి రుద్రాభిషేకం

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం శ్రీరాజరాజేశ్వరీ సమేత రామలింగేశ్వర స్వామి క్షేత్రంలో స్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త దల్లి గోపి నాగ ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. లక్కవరం, తాడువాయి, పంగిడిగూడెం, వేగవరం శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో స్వామి వారికి లక్ష తమలపాకులతో లక్షార్చన పూజలు చేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. నిత్యాన్నదాన సత్రంలో అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ సహాయ కమిషనర్ ఆర్‌వీ చందన ఏర్పాట్లను పర్యవేక్షించారు. గురవాయిగూడెం అయ్యప్పస్వామి దేవస్థానంలో అన్నదాన కార్యక్రమానికి పుట్లగట్లగూడెం గ్రామానికి చెందిన వామిశెట్టి సత్యనారాయణ, సుబ్బలక్ష్మి దంపతులు రూ.50,116 విరాళం అందజేశారు.

విశేష అలంకరణతో ఉమా రామలింగేశ్వరుడు

కొయ్యలగూడెం: కార్తీక మాసం చివరి సోమవారం యర్రంపేటలోని ఉమా సమేత రామలింగేశ్వర స్వామి వారు విశేష అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. శివ కేశవులకు ప్రీతిపాత్రమైన కార్తీక మాసం విశిష్టమైందని అర్చకులు అనుగ్రహ భాషణ చేశారు. కన్నాపురం దుర్గా భవాని సమేత రసలింగేశ్వరస్వామి, పులి వాగు భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి, అంకాలగూడెం ఉమా సమేత రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్న సమారాధనలు ఏర్పాటుచేశారు.

ఉమా భోగలింగేశ్వరస్వామికి పూజలు

పోలవరం రూరల్: మండలంలోని గుంజవరం గ్రామ సమీపంలో ఉన్న ఉమా భోగలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయం భక్తులతో కళకళలాడింది.

ఎన్నికల కోడ్ ఉల్లంఘన



బుట్టాయిగూడెం మండలం రాజానగరంలో ఉన్న కూటమి పార్టీల ఫ్లెక్సీ



పోలవరం మెయిన్ సెంటర్లో ఉన్న కూటమి పార్టీల ఫ్లెక్సీ

సాక్షి నెట్వర్క్: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ బేఖాతర్ చేస్తూ పోలవరం నియోజకవర్గంలోని పలుచోట్ల రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చి పది రోజులు గడుస్తున్నప్పటికీ కూటమి పార్టీలకు చెందిన ఫ్లెక్సీలను బుట్టాయిగూడెం, కొయ్యలగూడెం, పోలవరం, జీలుగుమిల్లి, టి.నరసాపురం, వేలేరుపాడు, కుక్కునూరు మండలాలలో దర్శనమిస్తున్నాయి. రాజకీయ పార్టీల నాయకుల విగ్రహాలకు సైతం ముసుగులు వేయకుండా వదిలేశారు. కూటమి ప్రభుత్వ ఫ్లెక్సీలను ఉంచి వైఎస్సార్‌సీపీకి చెందిన ఫ్లెక్సీలను మాత్రం తొలగించడం వివక్షతతో కూడుకున్న చర్య అని రాజకీయ విశ్లేషకులు ఆరోపిస్తున్నారు. వీటిపై అధికారులు, రిటర్నింగ్ అధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.

మఠంగూడెంలో సెమీక్రిస్మస్



మాట్లాడుతున్న బిషప్ జార్జికోర్నేలియస్

లింగపాలెం : ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయమని, మానవాళి ఆయన అడుగుజాడల్లో నడవాలని బిషప్ టి.జార్జికోర్నేలియస్ అన్నారు. మఠంగూడెం సీఎస్ఐ ఆలయం ఆవరణలో సంఘకాపరి బందెల ఆనందరావు శామ్యూల్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి సెమీక్రిస్మస్ నిర్వహించారు. బిషప్ క్రిస్మస్ కేక్‌ను కట్‌చేశారు. బిషప్ జార్జికోర్నేలియస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రీస్తుమార్గంలో నడవాలని సూచించారు. క్రీస్తు ప్రేమను ప్రపంచానికి చాటేలా ప్రతి విశ్వాసుడు పాటు పడాలని కోరారు. క్రీస్తు జననం గురించి వివరించారు. వృద్ధులు, పేదలకు దుస్తులు పంచారు. బిషప్ జార్జికోర్నేలియస్, జాషువా కుమారి దంపతులను ఘనంగా సన్మానించారు. అధ్యక్షఖండ కార్యదర్శి టి.రవి కుమార్, సహాయ కార్యదర్శి డీడీ సుధాకర్, ట్రెజరర్ అలెగ్జాండర్, డినరీ చైర్మన్ జాలా అలెగ్జాండర్, ఫాస్టర్స్, బి.ఆనందరావు శామ్యూల్, విశ్వాసులు పాల్గొన్నారు.

తెలంగాణ మద్యం పట్టివేత

కుక్కునూరు: కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో ఎక్సైజ్ ఎస్సై జి.వెంకటలక్ష్మి సోమవారం దాడులు నిర్వహించారు. గొల్లగూడెంలో తెలంగాణకు చెందిన ఎన్డీపీ మద్యం సీసాలు 36, ఒక మహిళను, కిష్టారం, మద్రిపాడు గ్రామాల్లో 21 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని ఓ వ్యక్తి, మహిళను అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశామని వెంకటలక్ష్మి తెలిపారు. దాడుల్లో ఎస్ ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యంతో వ్యక్తి అరెస్ట్

కామవరపుకోట: మద్యం కలిగిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు చింతలపూడి ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ పి.అశోక్ తెలిపారు. మండలంలో ఈస్టయడవల్లి గ్రామంలో సోమవారం ఒక వ్యక్తి వద్ద నుంచి ఆరు 6 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. నిందితుడిని తహసీల్దార్ ఎదుట హాజరు పరచి బైండోవర్ కేసు నమోదు చేశామన్నారు. ఎక్సైజ్ ఎస్సై అబ్దుల్ ఖలీల్, సిబ్బంది పాల్గొన్నారు.

నర్సరీలపై చర్యలకు వినతి

కుక్కునూరు: అనుమతుల్లేని నర్సరీలపై చర్యలు చేపట్టాలని కోరుతూ సోమవారం సీపీఎం నాయకులు ఆర్డీఓకు వినతిపత్రం అందించారు. మండలంలోని బంజరగూడెం, గణపవరం, ఇబ్రహీంపేట, రాయిగూడెం, అల్లిగూడెం, వేలేరు బోనగిరి తదితర గ్రామాల్లో గిరిజనులను పేరున అనుమతులు లేకుండా నర్సరీలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ నుంచి వచ్చిన స్థానికేతరులు కొందరు వోల్టా చట్టాలని తూట్లు పొడుస్తూ బోర్లు వేయడంతో భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయని, ఐనా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఆటో కార్మికులకు పార్కింగ్ స్థలం కేటాయించాలని కోరారు. సీపీఎం మండల కార్యదర్శి భయ్యన శ్రీను, నాయకులు యర్రంశెట్టి నాగేంద్రరావు, యర్నం సాయికిరణ్, ఎండీ పుల్లు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతలను పరామర్శించిన విజయరాజు



ఖాదర్ బాబును పరామర్శిస్తున్న విజయరాజు



వెంప కృష్ణతో మాట్లాడుతున్న నాయకులు

చింతలపూడి : చింతలపూడి మాజీ జెడ్పీటీసీ, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు చేపూరి ఖాదర్ బాబును వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు సోమవారం పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొంది శెట్టివారిగూడెంలోని తన స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్న ఖాదర్ బాబును విజయరాజు కలిశారు. ఆయన క్షేమ సమాచారాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షురాలు జగ్గవరపు జానకి రెడ్డి, ఎంపీపీ బి.రాంబాబు నాయక్, జెడ్పీటీసీ మొలుగు మాటి నీరజ సుధాకర్, నగర పంచాయతీ కన్వీనర్ కొప్పుల నాగేశ్వరరావు ఉన్నారు. ఇటీవల ఆసుపత్రిలో చికిత్స పొంది డిశ్చార్జ్ అయిన పార్టీ యూత్ విభాగం నాయకులు వెంప కష్ణను చింతలపూడిలో విజయరాజు పరామర్శించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ బొడ్డు వెంకటేశ్వరరావు, గణిజెర్ల సర్పంచ్ ఎ.వెంకట్రావు, నాయకులు త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, పి.మాధవ రెడ్డి, ఎ.సుబ్బారావు, కాటూరి ఏలియా, మిరియాల దిలీప్, మాజీ ఎంపీటీసీ గొట్టాపు బాబు, బండారు గోపి, గడ్డమడుగుల రాజేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పీడీఎఫ్ అభ్యర్థిని గెలిపించండి

కుక్కునూరు: ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి గోపి మూర్తిని గెలిపించాలని కోరుతూ సోమవారం ఏటీఏ, యూటీఎఫ్ సంఘాల నాయకులు సరియం నాగేశ్వరరావు, కె.కమల్ కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని కుక్కునూరు, చీరవల్లి, మాధవరం, అమరవరం పాఠశాలలో ఓటు అభ్యర్థిస్తూ యూటీఎఫ్, ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్, ప్రజా సంఘాల నాయకులు ప్రచారం చేశారు. ఆదివాసీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు సరియం నాగేశ్వరరావు, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.కమల్ కుమార్ మాట్లాడారు.

కోర్టు ఉత్తర్వుల మేరకు సర్వే చేయించాలి

జంగారెడ్డిగూడెం: కోర్టు ఉత్తర్వులు మేరకు సర్వే చేయించి, తమకు న్యాయం చేయాలని ఆర్డీఓ ఎంవీ రమణను అల్లంచర్ల రాజుపాలెం గ్రామ రైతులు కోరారు. సోమవారం స్పందన కార్యక్రమంలో టి.నరసాపురం మండలం అల్లంచర్ల రాజుపాలెం గ్రామానికి చెందిన రైతులు ఆర్డీఓ ఎంవీ రమణకు వినతిపత్రం అందజేశారు. అల్లంచర్ల రాజుపాలెం, చట్టుపక్కల రైతులు కొంతకాలంగా జీడి తోటలు, పామాయిల్ తోటలు పెంచుకుని జీవనం సాగిస్తున్నామని తెలిపారు. అధికారులు తమ భూముల్లోకి వచ్చి తోటలను ధ్వంసం చేస్తున్నారని, దీనిపై హైకోర్టును ఆశ్రయించామని చెప్పారు. కోర్టు స్టేటస్ కో ఇచ్చి, అటవీశాఖ, రెవెన్యూ శాఖ సంయుక్తంగా సర్వే చేసి సమస్యను పరిష్కరించాలని ఉత్తర్వులు ఇచ్చారని వివరించారు. కార్యక్రమంలో ఎం విజయరమేష్, ఎం సురేష్, జి.సత్యనారాయణ, ఎస్ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

నేడు కోటి దీపోత్సవం

జంగారెడ్డిగూడెం : కార్తీక మాస సందర్భంగా మంగళవారం సాయంత్రం జంగారెడ్డిగూడెం బైనేరు ఒడ్డున శివాలయం సన్నిధిలో సహస్ర జ్యోతిర్లింగ సహిత కోటి దీపోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ పేర్కొంది. కోటి ఒత్తుల జ్వలను కోరువారు ఫోన్ నెంబర్లు 94403 62441, 94939 90440లో సంప్రదించాలని కోరింది.

నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యం కొనుగోలు



మాట్లాడుతున్న తహసీల్దార్ చలపతిరావు

బుట్టాయగూడెం: రైతులు పండించిన ధాన్యాన్ని నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా కొనుగోలు చేస్తున్నట్టు తహసీల్దార్ పీవీ చలపతిరావు తెలిపారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో సోమవారం ధాన్యం కొనుగోలుపై రైతు సేవా కేంద్రం సహాయకులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, సహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్లకు ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో తహసీల్దార్ మాట్లాడారు. మండలంలో బుట్టాయగూడెం, రెడ్డిగణపవరం, జైనవారిగూడెం, విప్పలపాడు, నూతిరామన్నపాలెం గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేశామన్నారు. ఆయా కేంద్రాల్లో సుమారు 2800 గోనె సంచులు అందుబాటులో ఉంచామని తెలిపారు. ఏ గ్రేడ్ రకం ధాన్యం క్వింటాకి రూ.2,320, సాధారణ రకం ధాన్యానికి రూ.2300 కనీస మద్దతు ధర చెల్లిస్తున్నట్టు చెప్పారు. రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని సూచించారు. ఏఓ డి.ముత్యాలరావు మాట్లాడుతూ మండలంలో 3600 ఎకరాల్లో రైతులు వరి సాగు చేయగా, సుమారు 9450 మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేశామన్నారు. అనంతరం బుట్టాయగూడెంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. పౌర సరఫరాలశాఖ అధికారి కె.పద్మావతి, పీఎస్ఏ ఇన్‌చార్జి సాయిబాబా, వీఆర్ఓ పోతురాజు, రైతు సేవా కేంద్రం సహాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

భిక్షాటన చేయిస్తున్న తల్లులకు కౌన్సెలింగ్



పిల్లల తల్లులతో మాట్లాడుతున్న అధికారులు

ద్వారకాతిరుమల: శ్రీవారి కొండపై శివాలయ ప్రాంగణంలో పిల్లలతో భిక్షాటన చేయిస్తున్న తల్లులకు అధికారులు సోమవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. చైల్డ్ లైన్, ఉమెన్ డెవలప్‌మెంట్ అండ్ చైల్డ్ వెల్ఫేర్, పోలీస్, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్, ఎండోమెంట్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పిల్లలతో భిక్షాటన చేయిస్తున్న తల్లులను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వీరికి ఏలూరు జిల్లా చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ వై.వెంకటరాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మేరి, లక్ష్మీరాజ్యం, ద్వారకాతిరుమల సచివాలయం–2 మహిళా పోలీస్ లక్ష్మీ సుజనలు కౌన్సెలింగ్ ఇచ్చారు. బాలల హక్కులు, రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. పిల్లలతో భిక్షాటన చేయించడం శిక్షార్హమని, భవిష్యత్తులో ఇటువంటివి పునరావృతం అయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎమ్మెల్సీ బరిలో దుర్గాప్రసాద్

కొయ్యలగూడెం: జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తాను బరిలో నిలిచినట్టు ప్రైవేటు కళాశాల లెక్చరర్ చిక్కాల దుర్గాప్రసాద్ సోమవారం పేర్కొన్నారు. రాష్ట్ర ప్రైవేటు టీచర్స్, లెక్చరర్స్ వెల్ఫేర్ సొసైటీ తరపున సొసైటీకి ఉపాధ్యక్షుడిగా ఉన్న తాను బరిలో నిలిచినట్టు తెలిపారు. ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్‌కి ఉద్యోగ, ఆరోగ్య భద్రత ఉండేలా చట్టం తీసుకొచ్చేలా, పట్టబద్రులు అందరికీ ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా ప్రభుత్వంపై పోరాడేందుకు ముందుంటామని పేర్కొన్నారు.

క్లుప్తంగా

బ్రాహ్మణ సమాఖ్య నూతన కార్యవర్గం ఎన్నిక



బ్రాహ్మణ సమాఖ్య నూతన కార్యవర్గం

కొయ్యలగూడెం: స్థానిక ప్రాంతీయ బ్రాహ్మణ సమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్టు జిల్లా బ్రాహ్మణ సమాఖ్య ఉపాధ్యక్షుడు గార్ల సాయి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధ్యక్షుడిగా అనిపెద్ది రాధాకృష్ణ మూర్తి, ఉపాధ్యక్షుడిగా కండెరాయిని వెంకట్రావు, ప్రధాన కార్యదర్శిగా ఎంఎస్ బద్రీనాథ్, కోశాధికారిగా పెదసనగంటి అప్పారావుశర్మలు ఎన్నికయ్యారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని సత్కరించారు. బ్రాహ్మణ సమైక్య జిల్లా సభ్యులు సోంబట్ల వెంకటరమణ, జిల్లా ఉపాధ్యక్షుడు గార్ల సాయి, మాజీ అధ్యక్షుడు అనిపెద్ది రామం, పొన్న రమేష్, రిటైర్డ్ హెచ్ఎం వెంకటరమణ పాల్గొన్నారు.

షష్ఠి ఉత్సవాలకు అంకురార్పణ

కొయ్యలగూడెం: శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి మహోత్సవాలకు అంకురార్పణ పనులు సోమవారం ప్రారంభించారు. స్థానిక తాడేపల్లిగూడెం రోడ్డులో ఉన్న స్వయంభు సుబ్బారాయుడు ఆలయం వద్ద పందిరిరాట కార్యక్రమం నిర్వహించారు. డిసెంబర్ 6వ తేదీ రాత్రి దేవేరులతో సహా స్వామి వారి కళ్యాణోత్సవం, 7 నుంచి 11వ తేదీ వరకు షష్ఠి ఉత్సవాలు నిర్వహించనున్నట్టు అర్చకుడు అనిపెద్ది వెంకట నరసింహ శర్మ తెలిపారు. బయ్యనగూడెం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, రాజవరం, కన్నాపురం, కొయ్యలగూడెం, దిప్పకాయలపాడు, మంగపతీదేవిపేట, బోడిగూడెం, నరసన్నపాలెం, సరిపల్లి గ్రామాల్లో షష్ఠి ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

చెస్‌లో తన్మయికి ప్రథమం



తన్మయిని అభినందిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: స్థానిక దివ్యాస్ మాస్టర్స్ అకాడమీ క్రీడాకారిణి రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చింది. ఇటీవల తిరుపతి జిల్లా గూడూరులో జరిగిన రాష్ట్రస్థాయి ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్‌లో దివ్యాస్ మాస్టర్స్ అకాడమీ క్రీడాకారిణి మేడిచర్ల తన్మయి పాల్గొని, ప్రథమ స్థానంలో నిలిచిందని చెస్ కోచ్, డైరెక్టర్ అయినపర్తి సరళ మాధవి తెలిపారు. తన్మయిని మాధవితో పాటు సామాజికవేత్త కేఎల్ఎన్ ధనకుమార్, అయినపర్తి చంద్రశేఖర్, తల్లితండ్రులు, క్రీడాకారులు అభినందించారు.


హాస్టల్ భవనాలు నిర్మించాలి

బుట్టాయగూడెం: స్థానిక గిరిజన బాలుర కళాశాల వసతిగృహానికి నూతన భవనాన్ని నిర్మించాలని, బాలికల కళాశాల వసతి గృహానికి అదనపు భవనం నిర్మించాలని కోరుతూ పీడీఎస్‌యూ నాయకులు సోమవారం తహసీల్దార్ పీవీ చలపతిరావుకు వినతి పత్రం అందజేశారు. బాలుర వసతిగృహం శిథిలావస్థకు చేరిందని తెలిపారు. విద్యార్థులకు ట్రంక్ పెట్టెలు, దుప్పట్లు, టవల్‌లు, బెడ్‌షీట్‌లు, దోమతెరలు పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు బన్నే వినోద్, విద్యార్థులు కుర్సం చరణ్, బుద్దుల నాగమహేష్, తామా రామ్‌చరణ్, కుర్సం నాగమహేష్, కొవ్వాసు హేమంత్, మిర్తివాడ జగదీష్ పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ వద్ద ధర్నా

కుక్కునూరు: రైతులకు వ్యతిరేకంగా తెచ్చిన నల్లచట్టాల రద్దు కోరుతూ ఏఐపీకేఎస్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని అఖిల భారత రైతు సంఘం జాతీయ నాయకులు కెచ్చల రంగారెడ్డి కోరారు. సోమవారం కుక్కునూరు ప్రజాపంథా కార్యాలయంలో ఏఐపీకేఎస్ సమావేశం బాసినేని సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఏఐపీకేఎస్ రాష్ట్ర కన్వీనర్ ఎస్కే గౌస్, నాయకులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం ప్రాణసంకటం



రోడ్డు పక్కకు దూసుకెళ్లిన కారు

కుక్కునూరు: రోడ్డు పనుల్లో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వాహనచోదకులకు ప్రాణసంకటంగా మారింది. కుక్కునూరు మండలంలో ఆర్‌అండ్‌బీ రహదారి నిర్మాణ పనులు చేపట్టిన గుత్తేదారు రోడ్డు పై వెట్‌మిక్స్ పోయించిన అనంతరం నీరు చల్లించకపోవడంతో పెద్దవాహనాలు వెళ్లినప్పుడు దుమ్ములేచి వెనకవచ్చే వాహనచోదకులకు రోడ్డు సరిగా కనపడక ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డుపై దుమ్ము లేవడంతో ఇటీవల రాజీవ్‌నగర్ గ్రామ సమీపంలో ఓ కారు రోడ్డు పక్కన గోతిలోకి దూసుకెళ్లింది. తాజాగా సోమవారం కమ్మరిగూడెం గ్రామం వద్ద భద్రాచలం వెళ్తున్న కారు రోడ్డు పక్కన పొదల్లోకి దూసుకెళ్లింది. ఐతే ఈ రెండు ప్రమాదాల్లో ఎవరూ గాయపడలేదు. సమస్యను ఆర్‌అండ్‌బీ అధికారులకు పలు మార్లు చెప్పిన పట్టించుకోలేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.